ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా
చిరునవ్వుతో
ఎదుర్కొనగలవారే గొప్పవారు
- స్వామి వివేకానంద

Truth of News
PRGI Reg No: APTEL/26/A4782
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 15 | ఆదివారం 09 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ప్రశ్నలతో ఆగొద్దు.. పరిష్కారాలు చూపండి



- యువత సామర్థ్యాలపై పూర్తి నమ్మకం ఉంది
- వారి ఆలోచనలు, నిర్ణయాలే వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం : ప్రధాని మోడీ
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

దేశ యువత సమస్యలను గుర్తించి ప్రశ్నించడం మాత్రమే కాకుండా, వాటికి పరిష్కారాలను కనుగొనే దిశగా ఆలోచించాలని ప్రధాని మోడీ సూచించారు. యువత సామర్థ్యాలపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోడీ..పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఇప్పుడు అడుగుపెడుతున్న ప్రపంచం వేగంగా మారుతోందని చెప్పారు. సాంకేతికతతో పాటు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటు న్నాయన్నారు. రాబోయే 20--30 ఏండ్లలో ప్రపంచంలో ఎలాంటి మార్పులు వస్తాయో ముందుగానే చెప్పడం సాధ్యం కాదని చెప్పా రు. అందువల్ల యువతలో ఎప్పుడూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉండా లన్నారు. జీవితాంతం విద్యార్థులుగా కొనసాగాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త విషయాలను నేర్చుకునేవారే విజయాన్ని అందుకుంటారని తెలిపారు.

- మిగతా 3లో..

# యువశక్తికి మరేదీ సాటిరాదు !

- సమస్యల నెలవుగా అలహాబాద్ వర్సిటీ
- దేశంలో ఉద్యోగావకాశాల కొరత
- పడిపోతున్న విద్యార్హతల ప్రమాణాలు
- ప్రయాగ్‌రాజ్ 'ఛాత్రాం కీ గూంజ్' సభలో రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

భారత్‌కు అత్యంత గొప్పశక్తి ఈ దేశంలోని యువతే అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వారి శక్తి సామర్థ్యాలు ప్రపంచంలోని మరే దేశ యువతకు సాటిరావని అన్నారు. అటువంటి యువతకు ఉద్యోగావకాశాల కొరత నేపథ్యంలో నేడు విద్యార్హతల విలువపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ప్రయాగ్‌రాజ్‌లో 'ఛాత్రాం కీ గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. అలహాబాద్ వర్సిటీ సమస్యల నెలవుగా మారిందని ఆయన చెప్పారు. ఈ వేదిక వద్ద పరిస్థితులు సరిగా లేనప్పటికీ పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు హాజరయ్యారు. "మీరే భారత్‌కు శక్తి, గర్వకారణం" అని వారినుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ దేశంలోని ప్రతి ఒక్క భారతీయ పౌరుడి గురించి తాను మాట్లాడుతున్నానని అన్నారు. "దర్ద్ (నొప్పి, బాధ), డేటా, దౌలత్ (సంపద) గురించి మీతో మాట్లాడాలనుకుంటున్నా" అని అన్నారు. దేశంలో ప్రస్తుతం 40 కోట్ల మంది యువత ఉన్నారని, భారతదేశంలోని

- మిగతా 2లో..



# ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు..

- తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం
- తన భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిజీత్ డిప్కే
- అతిథులను కలవకుండా ఎస్ఐ అడ్డుకుంటున్నారని ఆరోపణ
- ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దంటూ అధికారిపై ఫైర్
- అతడిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే

- మిగతా 2లో..

## అంతర్జాతీయ దౌత్య సంబంధాల్లో
# మోడీ విఫలం

- ట్రంప్ ముందు మోకరిల్లుతున్న ఇండియా
- పొరుగు దేశాలతో పెరుగుతున్న శత్రుత్వం
- అమెరికా- ఇరాన్ యుద్ధం... ఇండియాపై ప్రభావం సదస్సులో వక్తలు




**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

అంతర్జాతీయ దౌత్య సంబంధాల్లో కేంద్రంలోని మోడీ సర్కార్ పూర్తిగా విఫలమైందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ సర్కార్ అనుసరిస్తున్న దౌత్య విధానాల వల్ల బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులు తదితర పొరుగు దేశాలు సైతం భారత్‌కు దూరమయ్యాయని అన్నారు. 'యూఎస్ఏ వార్ ఎగెనెస్ట్ ఇరాన్- ఇంపాక్ట్ ఆన్ ఇండియా' అనే అంశంపై ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్(ఇస్కఫ్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని అమృత ఎస్టేట్‌లో పార్లమెంట్ మాజీ సభ్యులు అజీజ్ పాషా అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల ఇంధన, ఆర్థిక, వ్యూహాత్మకంగా తీవ్రమైన ప్రభావం భారత్‌పై పడుతోందన్నారు. గాజాపై ఇజ్రాయిల్ మారణ హోమం, అమెరికాతో కలిసి ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధం, వెనిజులా అధ్యక్షులు చావేజ్ అపహరణ లాంటి చర్యలను ఇండియా ఖండించకపోవడం వల్ల ప్రపంచ దేశాల్లో ఒంటరిగా మారుతోందన్నారు. అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ముస్లిం వ్యతిరేక విధానం యొక్క పర్యవసానాలు భవిష్యత్‌లో భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ టర్కీ, సౌది అరేబియాతో కలిసి మినీ నాటోలాంటి కూటమిని ఏర్పాటు చేసిందన్నారు. అమెరికా యుద్ధం నేపథ్యంలో హార్ముజ్ జలసంధి మూసివేయడంతో చమురు ధరలు పెరిగి, దిగుమతి భారం పెరిగిందన్నారు. అలాగే గల్ఫ్ దేశాల నుంచి వలస కార్మికుల రాక, దౌత్యపరమైన సవాళ్లు భారత్ ఎదుర్కొంటోందని గుర్తు చేశారు. చమురు దిగుమతిలో ఏర్పడిన ప్రతిష్టంభన వల్ల రవాణా ఖర్చులు

- మిగతా 2లో..



# ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో పంజా..
## - కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్

**అమరావతి - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండ విస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ

- మిగతా 2లో..

# నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- ఎల్ నినో ప్రభావంతో 39 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం
- 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని సీఎం ఆదేశం
- తాగునీటి సరఫరా, పంటల రక్షణకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశం
- నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం



**అమరావతి- సూర్య వాస్తవం**

రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం అంచనా లకు మించి తీవ్రంగా ఉండే సూచనలు కనిపిసు న్నాయని, ఈ విపత్కర పరిస్థితు లను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జల వనరుల పరిరక్షణ కోసం చేపట్టిన 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని

- మిగతా 2లో..

# స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్‌కు ప్రమేయం లేదు
## - కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే

**డెహ్రాడున్ - సూర్య వాస్తవం**



దేశ స్వతంత్ర పోరాటంలో ఆర్ఎస్ఎస్‌కు కానీ, బీజేపీకి కానీ ఎటువంటి పాత్రాలేదని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. స్వాతం త్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీయేనని, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేం దుకూ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో శనివారం నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన ఆర్ఎస్ఎస్ బీజేపీ సభ్యులు ఒక్కరైనా ఉన్నారా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లినా వారు తొలుత కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత అటువైపు వెళ్లిన వారై ఉంటారని వ్యాఖ్యానించారు. కానీ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ప్రశ్నలతో ఆగొద్దు..
# పరిష్కారాలు చూపండి

(మొదటిపేజీ తరువాయి)

**సమస్యలను చూసి భయపడొద్దు**

జీవితంలో వచ్చే సమస్యలను చూసి భయపడాల్సిన అవసరం లేదని, పెద్ద సవాళ్లను చిన్న చిన్న భాగాలుగా విభజించి వాటికి పరిష్కారాలను అన్వేషించాలని మోడీ సూచించారు. కొత్త ఆలోచనలు, వినూత్న పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఉంటే సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవచ్చునన్నారు. ప్రతి తరానికీ దేశం పట్ల బాధ్యత ఉంటుందని మోడీ వివరించారు. రాబోయే 30--35 ఏండ్లలో యువత తీసుకునే నిర్ణయాలు, చేపట్టే కార్యక్రమాలే వికసిత్ భారత్ దిశను ప్రభావితం చేస్తాయని అన్నారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎంతవరకు ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల కోసం తాము ఏమి చేయగలమనే ప్రశ్నను ప్రతి యువకుడు తనకు తాను వేసుకోవాలని మోడీ సూచించారు.

**విద్యార్థులకు స్వర్ణ పతకాలు ప్రదానం**

స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను మోడీ ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో మహిళల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. మరింత మంది మహిళలు ఈ స్థాయిలో ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రం 'పరం ప్రజ్ఞ'ను ప్రధాని ప్రారంభించారు.

# యువశక్తికి మరేదీ సాటిరాదు !

(మొదటిపేజీ తరువాయి)

యువత మరెవరికీ సాటి రారని తరచుగా అమెరికా, చైనా, రష్యాలు మాట్లాడుతునే ఉంటాయని చెప్పారు. దేశంలో విద్యార్హతల ప్రమాణాలు పడిపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. నేడు భారత్‌లో విద్యా సర్టిఫికెట్లకు ఎలాంటి విలువా లేదని, ఆ కాగితాలతో వారికెలాంటి ఉద్యోగమూ రావడం లేదని అన్నారు.

తయారీ రంగం క్షీణిస్తోందని, రుణాల రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పరీక్షా పత్రాలు లీకవుతున్నాయని, కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోతున్నాయని ఇవన్నీ కలిసి యువత అవకాశాలను దెబ్బ తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే విద్వేషం, హింసలకు పాల్పడరాదని ఆయన వారికి సూచించారు. ప్రేమాభిమానాలతో వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించాలని సూచించారు. ప్రతి వెయ్యి మందిలో 12 మందికే పర్మినెంట్ ఉద్యోగం వస్తోందన్నారు. 21వ శతాబ్దంలో దేశ పురోగతి యువతకున్న శక్తి సామర్థ్యాలు, వారు సృష్టించే డేటా అనే రెండు అంశాలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అలహాబాద్ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను రాహుల్ వివరించారు. వర్సిటీలో ఫీజులను గతంలో కంటే 400 శాతం అధికంగా పెంచారని, హాస్టల్ ఫీజులు కూడా భారీ పెంచేశారని తెలిపారు. గ్రంథాలయం 8 గంటలే తెరిచివుంచుతున్నారని, వర్షాల సమయంలో నీళ్లతో నిండిపోతోందని తెలిపారు. గ్రంథాలయాన్ని 24 గంటలూ తెరిచివుంచాలని కోరితే.."ఏం? ఎక్కువ చదివేసి..కలెక్టరు అయిపోదామనే" అంటూ అక్కడి సిబ్బంది విద్యార్థులను ఎగతాళి చేసి మాట్లాడుతున్నారని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీలో నీళ్లు మంచిగా లేవని విద్యార్థులు ఫిర్యాదు చేస్తే.. వర్సిటీ అనేది మంచి నీళ్ల కేంద్రం కాదంటూ అధికారులు బదులిస్తున్నారని ఆయన వాపోయారు. "అందుకనే ఇక్కడ మీ స్వరాన్ని వినేందుకు, వాటిపై అధికారులను నిలదీసేందుకు వచ్చాను. వాళ్లు మన మీద కేసులు పెడితే పెట్టుకోనీ.. భయపడేది లేదు" అని విద్యార్థులను ఉద్దేశించి రాహుల్ అన్నారు.

# ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు.

వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,''నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అనుమతించడానికి మీకేంటి ఇబ్బంది? ఢిల్లీ పోలీసుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదు, మిమ్మల్ని ఇప్పుడే మొదటిసారి చూస్తున్నాను. నేను ఎవరిని కలవాలి, ఎవరిని కలవకూడదు అనేది మీరు నిర్ణయించలేరు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, మీరు నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. మరో వీడియోలో ఆయన ఓ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, "సురేశ్ అనే ఎస్ఐ ఇక్కడ చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారా? ఆయన నాకు వద్దు, వెంటనే ఇక్కడి నుంచి తొలగించండి" అని కోరారు. అంతేకాకుండా, రాష్ట్ర సీఐడీకి చెందిన సిబ్బంది మఫ్టీలో తన ఇంటి పరిసరాల్లో ఉంటూ 'హిట్ స్ప్రే' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓ విలేకరి ఒక అధికారి ఫోన్‌లో ఈ గ్రూప్‌ను గమనించారని ఆయన పేర్కొన్నారు.

# స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్‌కు ప్రమేయం లేదు

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామ్యం లేకపోయినా బీజేపీ నేతలు దేశభక్తిపై పాఠాలు, నీతులు చెబుతుంటారని ఖర్గే ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారని ప్రశంసించారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆరోజు ఎంతో కీలకమైందన్నారు. డూ ఆర్ డై, క్విట్ ఇండియా నినాదాలతో మహాత్మా గాంధీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశారని గుర్తుచేశారు. ఉత్తరాఖండ్‌ను దేవభూమిగా పేర్కొన్న ఖర్గే, ఆ ప్రాంతానికి దేశ రక్షణలోనూ ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. కుమావోం, గర్వాల్ రెజిమెంట్లు దేశవ్యాప్తంగా ఎంతో పేరు పొందాయని చెప్పారు. దేశానికి తొలి పరమ్ వీర్ చక్ర అవార్డు అందుకున్న వీర సైనికుడు కూడా ఆ ప్రాంతం నుంచే వచ్చారని ఖర్గే పేర్కొన్నారు.

## అంతర్జాతీయ దౌత్య సంబంధాల్లో
# మోడీ విఫలం

(మొదటిపేజీ తరువాయి)

పెరిగాయన్నారు. ఫలితంగా దేశంలో నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం ఏర్పడిందని గుర్తు చేశారు. అమెరికా-ఇరాన్ యుద్ధం విషయంలో ఏ ఒక్క పక్షం వైపు మొగ్గు చూపకుండా వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని పాటిస్తూ అన్ని దేశాలతో దౌత్య సంబంధాలను సమతుల్యం చేసుకునే ప్రయత్నం చేస్తున్నామనే ప్రధాని మోడీ ప్రచారం పచ్చి అబద్ధమని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నెహ్రూ హయాంలోని నాన్ ఎలైన్ విధానానికి మోడీ సర్కార్ తూట్లు పొడిచిందన్నారు. ఇండియాపై ట్రంప్ టారిఫ్‌ల వార్ ప్రకటిస్తూ మన ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నా... జై ట్రంప్, జైజై ట్రంప్...అంటూ మోడీ కాళ్ల బేరానికి వెళుతున్నారని విమర్శించారు. గాల్వాన్ ఉగ్రదాడితో పాటు అనేక అమానుష సంఘటనలను అమెరికా ఎనాడు ఖండించలేదని గుర్తు చేశారు. మొదటి నుంచి అమెరికా భారత్ వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు. అభివృద్ధి, సాంకేతికత వైపు ప్రపంచం వేగంగా దూసుకు పోతుంటే ఇండియా మాత్రం కులం, మతం, హిందూ జాతీయత అంటూ తిరోగమనం వైపు పయనిస్తోందని ఎద్దేవా చేశారు. మంగోలియా మాజీ రాయబారి టి.సురేశ్ మాట్లాడుతూ అమెరికా ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తూ గుత్తాధిపత్యం సాధించేందుకు యుద్ధాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఏఐ, సైబర్ వార్, డ్రోన్ వార్ లాంటి యుద్ధాలు జరిగే ప్రమాదమున్న నేపథ్యంలో ఇండియా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ జాతీయ కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహరి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కడారు ప్రభాకర్ రావు, జి. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి వనరుల పరిరక్షణపై
# ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఇకపై ఒక నిరంతర కార్యక్రమంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, పంటల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపునకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన దిశానిర్దేశం చేశారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి.. జలధార-జలహారతి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

**39 శాతం లోటు వర్షపాతం..**
**తీవ్ర నీటి సంక్షోభం**

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే 39 శాతం తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో సాధారణంగా 867 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 525 మి.మీ. మాత్రమే కురిసే అవకాశం ఉందని అంచనాలను నివేదించారు. ముఖ్యంగా ఆగస్టు నెలలో లోటు 56 శాతానికి చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వర్షాభావ పరిస్థితుల ప్రభావం ఇప్పటికే రిజర్వాయర్లపై స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బేసిన్లలో కలిపి ప్రస్తుతం 563.05 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండగా, గతేడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేదని లాంపోల్చి చెప్పారు. ఆగస్టు నుంచి భూగర్భ జలమట్టాలు కూడా వేగంగా పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

**తాగునీటి సరఫరాకే అగ్ర ప్రాధాన్యం**

ఎల్ నినో తీవ్రత దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి వంటి రిజర్వాయర్లలో తాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా నీటిని నిల్వ చేయాలని సూచించారు. నాగార్జున సాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాల తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులపై వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని ఒడిసి పట్టుకుని, ప్రాజెక్టులను వీలైనంత మేర నింపాలని దిశానిర్దేశం చేశారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు.

**పంటలు, పశుసంపద రక్షణకు చర్యలు**

వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రాధాన్యతా క్రమంలో నీటిని విడుదల చేయాలని సీఎం సూచించారు. భవిష్యత్తులో తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని చెప్పారు. అదే సమయంలో, పరిశ్రమలకు కూడా నీటి కొరత లేకుండా చూడాలన్నారు. పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల గోకులాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి వినియోగం, పొదుపుపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని కోరారు. ఈ సమీక్షలో అధికారులు 'జలధార-జలహారతి' కార్యక్రమ పురోగతిని సీఎంకు వివరించారు.

ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.3,409.35 కోట్ల అంచనాతో 82,865 పనులు గుర్తించగా, ఇప్పటికే 79,826 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్ల వంటి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, నీటిపారుదల, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలు కోల్పోతున్నా పాలకులు
# రోడ్డు విస్తరణ చేయరా ?

- పత్తికొండలో రోడ్డు విస్తరణ వెంటనే చేపట్టాలి.
- ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్
- రోడ్డు విస్తరణ చేపట్టే అంతవరకు పోరాటాలు ఉధృతం చేస్తాం
- సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి.
- 2029 లో వచ్చే ఎన్నికలకు కూడా రోడ్డు విస్తరణ చేపడతామని నాయకులు ప్రజల ముందుకు వస్తారా?




పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం : పత్తికొండ పట్టణంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి ఆటోలు, లైట్ మోటార్ వెహికల్స్, ద్విచక్ర వాహనాలతో పట్టణ పురవీధుల గుండా అంబేద్కర్ సర్కిల్ మీదుగా నాలుగు స్తంభాల కూడలి వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలి దగ్గర రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ఆటో కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, పార్టీ మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రంగారెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ పట్టణంలో ఇరుకైన రోడ్ల కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పాలకులు అధికారులు రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టారా అన్నారు. రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టే అంతవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 2029 లో వచ్చే ఎన్నికలకు కూడా రోడ్డు విస్తరణ చేపడతామని నాయకులు ప్రజల ముందుకు వస్తారా? అని వారు ప్రశ్నించారు. కొందరి ప్రయోజనాల కోసం గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే వాహనదారులు పట్టణ ప్రజలకు అనేక ఇబ్బందులు కలుగుతున్న పాలకుల మొండి వైఖరి వల్ల విస్తరణ కార్యక్రమానికి నోచుకొని పత్తికొండ పట్టణంలో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్న అటు నాయకులు ఇటు అధికారులు నిమ్మకు నీరెత్తినటువంటి విధంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పత్తికొండ పట్టణం రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాలని లేనిపక్షంలో వినూత్నమైనటువంటి కార్యక్రమాల ద్వారా పత్తికొండ బందుకు కూడా పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు దస్తగిరి రామాంజనేయులు రజక సంఘం నాయకులు ఈరన్న సిఐటియు మండల అధ్యక్షులు గోపాల్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కాశన్న మండల కార్యదర్శి శివశంకర్ రైతు సంఘం రాజుల కారప్ప ఆటో కార్మిక సంఘం నాయకులు శేఖర్ బాలు సురేష్ శీను. లైట్ మోటర్ వెహికల్స్ కార్మికులు ద్విచక్ర వాహనదారులు సిఐటియు అమాలి కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో పంజా..

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. "పాలనను గాలికొదిలేసి, కులమత కొట్లాటల్లో, కేసుల్లో, మోదీ పొగడ్త సభల్లో మీరు, మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజీగా ఉన్నారు. అటు వైసీపీ, ఇటు కూటమి రెండూ ఒకటే. వీరికి రాష్ట్రం, ప్రజల బాగోగులు పట్టవు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆరేడు నెలలుగా ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం కనీస కంటింజెన్సీ ప్రణాళికలు కూడా సిద్ధం చేయలేదని దుయ్యబట్టారు. జిల్లాల వారీగా సమీక్షలు, రైతులకు మార్గదర్శకాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం క్వాంటం, డేటా సెంటర్లంటూ కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నారని, మిమ్మల్ని నమ్ముకున్న లక్షలాది రైతుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరపున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.

# సంపాదకీయం

## విద్యావిధానంలో మార్పులు అనివార్యమా...




కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు. ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్ –జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. గతంలో విద్యార్థి ఉద్యమాలు రాజకీయ పార్టీల ఆధిపత్యంలో నడిచినప్పటికీ, ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. ఈ నిరసనలు పరీక్షా సంస్కరణలకే పరిమితం కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా మారాయి. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, వరుసగా జరుగుతున్న పరీక్షా అవకతవకలు, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న నమ్మకం –ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర నిరాశను కలిగించాయి. అందువల్ల ఈ ఉద్యమం ఒక పరీక్ష గురించి మాత్రమే కాకుండా, ఒక తరం భవిష్యత్తు గురించి సాగిన పోరాటంగా మారింది ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియకూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటిస్తూ, పోలీసు చర్యలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పౌరహక్కులను గౌరవించే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యం విభేదాలను అణచివేయడం వల్ల కాదు; ప్రజల ఆందోళనలను నిర్మాణాత్మకంగా వినడం వల్ల బలపడుతుంది. సమకాలీన రాజకీయ చర్చలను ప్రభావితం చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఎంతో పెరిగింది. మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, డిజిటల్ ప్రచారాలు ప్రజల దృష్టిని ఆకర్షించే శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అయితే అవి సంక్లిష్టమైన విధాన చర్చలను అతిగా సరళీకరించే ప్రమాదం కూడా ఉంది. ప్రజాభిప్రాయం వైరల్ కథనాల కంటే ఆధారాలతో కూడిన సమాచారంపై ఆధారపడాలి. అదే విధంగా, ఇ–20 ఇథనాల్ మిశ్రమ ఇంధనం చుట్టూ జరిగిన చర్చలు ప్రజల విశ్వాసం పారదర్శకమైన శాస్త్రీయ సమాచారంపై ఆధారపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, సాంకేతిక మార్పులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు నిరంతర ప్రజా చర్చకు లోనవ్వాలి. ప్రజలకు ప్రయోజనాలు, ఖర్చులు, దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన ఆధారాలతో కూడిన సమాచారం అందించాలి. ఈ రాజీనామా భారత రాజకీయాల్లో ఒక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రజల నిరంతర ఒత్తిడి ప్రభుత్వాలను తమ నిర్ణయాలను పునఃపరిశీలించడానికి దారితీయగలదనే విషయాన్ని ఇది సూచిస్తుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది తీర్పు భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి సంఘటనలు కాలక్రమేణా పౌరులు, –ప్రభుత్వాల సంబంధాన్ని పునర్నిర్వచిస్తాయి. అత్యంత ముఖ్యంగా, భారత విద్యా సంక్షోభం ప్రశ్నాపత్రాల లీకులతో మాత్రమే పరిమితం కాదు. పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం, విద్యాసంస్థల్లో ఖాళీలు, ఉన్నత విద్యలో తగిన పెట్టుబడుల కొరత, విద్యా రంగం వాణిజ్యీకరణ– ఇవన్నీ కలిసి విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. విద్యా పరిపాలనలో సమగ్ర సంస్కరణలు లేకుండా పరీక్షా సంస్కరణలు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించలేవు. భారతదేశానికి అత్యవసరంగా సమగ్ర పరీక్షా సమగ్రత వ్యవస్థ అవసరం. సురక్షితమైన డిజిటల్ మౌలిక వసతులు, స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలు, బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు, నియామక ప్రక్రియల పారదర్శక ఆడిట్లు, పరీక్షా మోసాలపై వేగవంతమైన న్యాయ చర్యలు, సమాచార బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ, పోటీ పరీక్షలకు దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులకు మానసిక సలహా, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలి. చివరికి, ఏ విద్యార్థి ఉద్యమానికైనా నిజమైన విజయాన్ని కేవలం ఒక మంత్రి రాజీనామాతో కొలవలేం. అది శాశ్వతమైన సంస్థాగత సంస్కరణలకు దారితీస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. నిర్మాణాత్మక సంస్కరణలే శాశ్వత మార్పును తీసుకువస్తాయి. ఈ పరిణామాలు విధాన నిర్ణేతలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. విద్య అనేది కేవలం పరిపాలనా రంగం కాదు; అది కోట్లాది భారత యువత కలలు, ఆశయాలు, భవిష్యత్తుకు ప్రతీక. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో, విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు రక్షించడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడం జాతీయ ప్రాధాన్య అంశాలు మారాలి. అప్పుడే భారతదేశం ప్రజల ఆగ్రహాన్ని అర్థవంతమైన విద్యా సంస్కరణలు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనంగా మార్చగలదు.

# మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

**విజయవాడ – సూర్య వాస్తవం :**

వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజక వర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తు న్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల




ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

### గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది.

యువత, విద్యార్థుల సమస్యలను లేవనెత్తుతోంది. నీట్ తరహాలోనే ఏపీలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. జెన్ జీ ఉద్యమం ముందు వరకూ డీఎస్సీలో అక్రమాలపై వైసీపీ సాగించిన పోరాటం.. ప్రధాన్ రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల కారణంగా కొత్త రూపు తీసుకుంది.

వైసీపీ చేసే నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలోనూ జెన్ జీ పేరును వైసీపీ నేతలు ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొగాకు రైతులను పరామర్శించేందుకు తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లిలో పర్యటించారు. జగన్ పర్యటనకు జెన్ జీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని... యువతరం పెద్ద సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారని వైసీపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇప్పుడు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద జెన్ జీ ప్రస్తావన తేవడం మారిన వైసీపీ స్ట్రాటజీకి నిదర్శనమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు

# ఓటుకు ఈవీఎంలా.. బ్యాలట్ బాక్సులా

**ఒంగోలు – సూర్య వాస్తవం :**

స్థానిక సంస్థల ఎన్నికల నగారా అతి త్వరలో మోగనుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో సమావేశమయ్యారు. 2021లో జరిగిన తీరును, ఇప్పుడు జరగనున్న విధానంపై చర్చించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చించారు. ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ క్షణమైనా మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నగారా మోగొచ్చని.. అధికారులు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అలర్ట్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఈ ఎన్నికలకు




బ్యాలట్ బాక్సులు వినియోగించాలా, ఈవీఎంలు వాడాలా అనే అంశంపై కూడా చర్చించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉన్నందున వాటిని పరిష్కరించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చీఫ్ సెక్రటరీ వివరించారు. పెండింగ్‌లో 23 కోర్టు కేసులు ఉంటే వాటిల్లో నాలుగు పరిష్కారమయ్యాయి అని తెలిపారు. ఇక పంచాయతీల విషయానికి వస్తే రాష్ట్రంలో మొత్తం 13,359 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2021లో 354 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఒక ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. పురపాలకశాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలీస్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపైనా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? ఈవీఎంలు వాడాలా? అనే అంశంపై కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా ఎన్ని బ్యాలట్ బాక్సులు ఉన్నాయి, ఎన్ని ఈవీఎంలు ఉన్నాయి అనే వివరాలను అధికారులు నివేదించారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రూ. 3.5 కోట్ల వరకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించగా.. ఈ ఏడాది ఎంత బడ్జెట్ అవుతుందో కూడా చర్చించారు

# అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్

## - డిసెంబర్ నెలలో పరీక్షలు.. విద్యాశాఖ ప్రకటన

**విజయవాడ – సూర్య వాస్తవం :**

ఏపీలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్. అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ నెలలో పరీక్షలు ఉంటాయని ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు శుక్రవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుభవార్త చెప్పింది. వచ్చే అక్టోబర్ నెలలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణల మీద ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మరోసారి వివరణ ఇచ్చింది. అమరావతి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడిన తమీమ్ అన్సారియా.. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ 2025 ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించామన్నారు. అయినప్పటికీ డీఎస్సీ 2025పై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని.. ఆందోళనకు గురికావద్దని సూచించారు. మరోవైపు 2025 డీఎస్సీపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఇప్పటి వరకూ మూడుసార్లు వివరణ ఇచ్చామని.. అయినా కూడా దుష్ప్రచారం చేస్తుంటే మరోసారి క్లారిటీ ఇస్తున్నట్లు వివరించారు. హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారమే అర్హులకే పోస్టులు దక్కాయన్న తమీమ్ అన్సారియా.. ఏవైనా అనుమానాలు ఉంటే తమ వద్దకు రావాలని సూచించారు. 12 పద్ధతులను అనుసరించి డీఎస్సీ నిర్వహించామని.. డీఎస్సీ మెరిట్, సెలక్షన్ లిస్టును ఆన్ లైన్‌లో ఎప్పుడైనా చూసుకునే అవకాశం ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆందోళనకు గురికావొద్దని.. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తమీమ్ అన్సారియా తెలిపారు. ఉద్యోగాలు రాని అభ్యర్థులు.. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మకుండా వచ్చే డీఎస్సీపై దృష్టిపెట్టాలని తమీమ్ అన్సారియా సూచించారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా టీచర్ల నియామకాలపై ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ భరణి స్పందించారు. అన్ని ఫెడరేషన్లు, స్పోర్ట్స్ అసోసియేషన్లు నుంచి పూర్తి వివరాలు సేకరించామని, ప్రతి అభ్యర్థి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించామని వివరిం చారు. ఆ తర్వాతే ప్రిలిమినరీ ప్రాధాన్యత జాబితాను రూపొందించి విద్యాశాఖకు పంపినట్లు భరణి క్లారిటీ ఇచ్చారు. మరోవైపు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

# ముగిసిన నిరాహార దీక్షలు

**- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి**
**- విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**
**- ఈ నెల 10న భారీ నిరసన ర్యాలీకి వై. విశ్వేశ్వరరెడ్డి పిలుపు**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి సీబీఐ విచారణ జరిపించాలని, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరాహార దీక్షలు ముగిశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ నియామక ప్రక్రియపై నిరుద్యోగుల్లో అనేక అను మానాలు, ఆందోళనలు నెలకొన్నాయని అన్నారు. అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. డీఎస్సీ అంశంతో పాటు నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ నెల 10న భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వై. విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# దత్త పాదుక క్షేత్రంలో గీతా జ్ఞాన యజ్ఞం




**పామిడి - సూర్య వాస్తవం :** అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రము శనివారం నుండి ఆగస్టు 15 వరకు ప్రతిరోజు సాయంత్రం 6:30 నుండి 8 గంటల వరకు పూజ్య గురువులు పరమపూజ్యులు గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో పూజ్యశ్రీ బాల స్వామీజీ వారి అనుమతితో. శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం. పామిడి నందు పూజ్యశ్రీ స్వామి 30 ఆత్మవిదానంద సరస్వతి, చిన్మయ మిషన్, అనంతపురము. గారిచే భగవద్గీత 3వ అధ్యాయం (కర్మయోగము) పై గీతా జ్ఞాన యజ్ఞము భక్తి శ్రద్ధలతో నిర్వహించబడును. **వేదిక :** శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం, పామిడి. భగవద్గీత దివ్యజ్ఞానాన్ని శ్రవణం చేసి, జీవన విధానాన్ని ఆధ్యాత్మిక దిశగా మలుచుకొనే ఈ పవిత్ర అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసిందిగా సద్భక్తులందరికీ హృదయపూర్వక ఆహ్వానం. అందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి పూజ్య గురుదేవుల దివ్యానుగ్రహాన్ని పొందగలరు.
గురుదత్త సేవాసమితి, అనఘా ఆత్రేయ దత్తపాదుకా క్షేత్రం, ఈ కార్యక్రమంలో ఎంహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి పత్రా శ్రీనివాసులు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జోరుగా ఇంటింటికి టీడీపీ ప్రచార కార్యక్రమం



**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం యువనేత పామిడి గుత్తి గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు పట్టణం 13వ వార్డులో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జోరుగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు వార్డులలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచిని వివరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అన్ని అమలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ బొల్లు శ్రీనివాస రెడ్డి, విభిన్న ప్రతిబావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్న గారి కుమార్, మాజీ మైనారిటీ అధ్యక్షులు హుస్సేన్ పీరా, బూత్ కన్వీనర్ చిరంజీవి, వార్డు అధ్యక్షులు టీ . నారాయణ స్వామి,కో కన్వీనర్ భాస్కర్ గౌడ్, టీడీపీ కార్యకర్త బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సోదరి వివాహానికి టీడీపీ నాయకులను ఆహ్వానించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి గుంతకల్లు నియోజక వర్గం శాసనసభ్యులు గుమ్మ నూరు జయరాం పుత్రికకు, జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారుడితో వివాహం నిశ్చయించిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే తనయుడు యువనేత గుత్తి పామిడి ఇన్‌చర్జి గుమ్మనూరు ఈశ్వర్ తన సోదరి వివాహానికి రావాలని గుత్తి పట్టణంలో టిడిపి ప్రముఖులకు వివాహ పత్రికను అందజేసి కచ్చితంగా వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# కథనాలు ఎన్నో.. స్పందన మాత్రం ఏది..!

- అనంతపురం సర్వజన ఆసుపత్రి సమస్యలపై వైద్యశాఖ మంత్రి స్పందన ఏదీ...?,
- స్థానిక ఎమ్మెల్యే, ఆసుపత్రి సూపరింటెండెంట్ మౌనం ఎందుకు..?
- పేద మధ్యతరగతి ప్రజలకు ఇంకా ఎన్ని రోజులు ఈ అవస్థలు
- ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించరా.....?



**అనంతపురం వైద్యం- సూర్య వాస్తవం :**

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వరుసగా కథనాలు వెలువడుతున్నా.. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ముఖ్యంగా రోగులకు అత్యవసరంగా అవసరమైన వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలపై ఇప్పటివరకు ఆసుపత్రి యాజమాన్యం వాస్తవ పరిస్థితిని వెల్లడించకపోవడంపై రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఇలాంటి చోట కనీస అత్యవసర సదుపాయాలపై ఫిర్యాదులు వస్తున్నప్పుడు.. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

**మంత్రి.. ఎమ్మెల్యే దృష్టికి వెళ్లలేదా?**

ఆసుపత్రిలోని సమస్యలపై వరుసగా కథనాలు ప్రచురితమవుతున్న నేపథ్యంలో ఈ అంశం వైద్యశాఖ మంత్రి దృష్టికి వెళ్లలేదా స్థానిక ప్రజాప్రతి నిధులకు సమాచారం అందలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ప్రజలకు నేరుగా సంబంధించిన ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై ప్రజాప్రతినిధులు స్పందించి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తే సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని రోగుల బంధువులు ఆశిస్తున్నారు.



**సూపరింటెండెంట్ స్పందన ఎప్పుడు?**

ఆసుపత్రిలో ప్రస్తుతం ఎన్ని వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉన్నాయి? వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి? వాటిని రోగుల కోసం మాత్రమే వినియోగిస్తున్నారా? మెడికల్ సామాగ్రి తరలింపునకు వాటిని ఉపయోగిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యత వహించాల్సిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారికంగా వివరణ ఇచ్చి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలి.

**మౌనం సమస్యకు పరిష్కారం కాదు**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి కనీస సదుపాయాలు అందించడం అధికారుల బాధ్యత. ఒక రోగి వీల్‌చైర్ లేదా స్ట్రెచర్ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి వస్తే.. అది చిన్న సమస్యగా చూడాల్సిన విషయం కాదు. ఇప్పటికైనా వైద్యశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందించి.. ఆసుపత్రిలోని వాస్తవ పరిస్థితిని పరిశీలించి, అవసరమైన సదుపాయాలు కల్పించాలి. కథనాలపై స్పందన లేకపోవడం కంటే.. వాస్తవ పరిస్థితిని పరిశీలించి ప్రజలకు సమాధానం ఇవ్వడమే అధికారుల బాధ్యత. మరి.. ఈ సమస్యలపై స్పందించేది ఎవరు? చర్యలు తీసుకునేది ఎప్పుడు? అన్నది వేచి చూడాలి.

# గుత్తికి చేరిన సీపీఐ జీపు

**- జాత స్వాగతం పలికిన సిపిఐ నాయకులు**




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం గాంధీ సర్కల్ నందు మార్పు కోసం,జీపు జాత మూడవ రోజు గుత్తికి చేరుకుంది. సీపీఐ, గుత్తి, మండల కార్యదర్శి రామదాసు, అధ్యక్షతన,ఈ కార్యక్రమం, జరిగింది. ఈ జీపు జాత ము ఖ్య ఉద్దేశం,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ, ఆగస్టు6,నుండి 14,తారీకు వరకు జిల్లా వ్యాప్తంగా ఈ జీపు జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకులు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన టువంటి సూపర్ సిక్స్ పథ కాలన్నీ కూడా అమలు చేయాలని, మరి కేంద్ర ప్రభుత్వం రైతులకు నిరుద్యోగు లకు నడ్డి విరుస్తున్నటువం టి కేంద్ర ప్రభుత్వం,రైతులకు గిట్టుబాటు కల్పించాలని ని త్యవసర వస్తువులు ధరలు తగ్గించాలని,కేంద్ర రాష్ట్ర ప్ర భుత్వాలకు సంబంధించి పది డిమాండ్లతో ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నారు. మరి అదేవిధంగా,ఈ నెల 17వ తారీకు,అనంతపురం జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా పెద్ద ఎత్తున,ధర్నా నిర్వహించడం జరుగుతుంది. ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు సీపీఐ, పార్టీ నాయకులు, సానుభూతిపరులు ప్రజలు పాల్గొని ధర్నా కార్య క్రమాన్ని జయప్రదం,చేయాలని. పిలుపునిచ్చారు. ఈ కా ర్యక్రమానికి సారథ్యం వహి స్తున్నటువంటి జిల్లా కార్య దర్శి నారాయణస్వామి,జి ల్లా సహాయ కార్యదర్శి మ ల్లికార్జున,ఏఐటీయూసీ రా ష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీర భద్ర స్వామి, నియోజకవర్గ నాయకులు రమేష్ బాబు, పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, సహాయ కార్యదర్శులు, నజీర్, మహమ్మద, మండల సహాయ కార్యదర్శులు వెంకట్రాముడు, నరసింహయ్య, మధుసూదన్ రావు, సీనియర్ నాయకులు, షఫీ, రామకృష్ణ, టియం, బాషా, గోపాల్, ఆటో, డ్రైవర్లు, కోనాఅమర్, మౌలాలి,శివకుమార్,ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా కళాబృందం, కుళ్లాయప్ప, ప్రేమ్ కుమార్, కళాకారులు తదితరులు ఈ కా ర్యక్రమంలో పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన చేనేత కార్మికులు

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి శనివారం మండలంలోని టిడిపికి చెందిన చేనేతకార్మికులు పాలాభిషేకం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులకు 25000 చెప్పున రాష్ట్ర ప్రభుత్వం వారి ఖాతాల్లోకి జమ చేయడంతో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడైన ఎన్టీఆర్ విగ్రహం ఎదుట భారీ కేకు కట్ చేసి తెలుగు తమ్ముళు అందరూ పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు మండల ఎడిసిసి బ్యాంక్ అధ్యక్షుడు బొల్లుశ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ ఫీరా జింకలసంజీవ, పాల్గొని ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వానికి బీసీ లంటే ఎంతో గౌరవం అని వారి అభివృద్ధే ధ్యేయంగా మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నాడని, పేద బడుగు బలహీన వర్గాలకు టిడిపిలో ప్రత్యేకమైన సముచిత స్థానం కల్పించాడని అందులో భాగంగా చేనేత జాతీయ దినోత్సవ సందర్భంగా రాష్ట్రంలో 54 వేల మంది కుటుంబాలకు 25000 ప్రకారం నిధులు విడుదల చేయడమే గాక రంగులు అద్దేవారికి, రాట్నం చెప్పే వారు పదివేల మందికి కూడా 25000 నిధులు కేటాయించాడన్నారు. సంక్షేమలో భాగంగా వారికి 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నా డన్నారు. కావున త్వరలో రానున్న స్థానిక ఎన్నికలలో పేదబడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం పాటుపడే తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లు.శ్రీనివాసులరెడ్డి, గౌస్ పీరా, జింకలసంజీవ, బాబు, రంగనాయకులు, గుత్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మాలిక్ భాష,చిదంబరం, హరికృష్ణ, రంగస్వామి, మండ్లరాజు, శ్రీనివాసులు, హుస్సేన్ పీరా, గంపమల్లయ్య, రామాంజనేయులు, ప్రసాద్, గోమాతిశంకర్, ఆర్మీరఫీ, వెంకటేష్ తదితర తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

# మెగా కాదు దగా డీఎస్సీ

**- డీఎస్సీ అవినీతిపై సిబిఐ విచారణ చేపట్టాలి**
**- జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి**



**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గంలోని విద్యార్థి నిరుద్యోగుల సమస్యలతో పాటు డీఎస్సీ అక్రమాలపై వైసిపి గుంతకల్ నియోజకవర్గ సమన్వాయకర్త వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వైసీపీ ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం పక్కన ప్రారంభమైన రిలే నిరాహార దీక్ష మూడవరోజు దీక్షకు పామిడి వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ వైసిపి పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీ నిర్వహించిన సమయంలో జరిగిన అవకతవకులపై సిబిఐ విచారణ చేపట్టాలని ప్రతిభ కలిగిన వారికి కాకుండా దొడ్డి దారిన చాలామంది ఉద్యోగులు పొందారాని తెలిపారు. అలాంటి వారి వల్ల పేద విద్యార్థులు ప్రతిభ కలిగిన వారి జీవితాలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ లో ప్రతిభ చూపిన విద్యార్థులు నుంచి ఒక్కొక్కరి దగ్గర 15 నుంచి 20 లక్షల రూపాయలు లంచాలుగా తీసుకొని వారికి పోస్టింగ్ ఇచ్చారని అలాగే పరీక్షలు కూడా రాయనివారు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించారని. ఇవి ఎంతవరకు న్యాయమని తెలిపారు. ఈ విధంగా డీఎస్సీ నిర్వహణలో జరిగిన అవకతవకల్లో అక్రమాలపై డీఎస్సీ నిరుద్యోగులు మరియు యువతీ యువకులు రోడ్డున పడ్డారు మరి కొంతమంది యువకులు హైకోర్టును కూడా వెళ్లారని తెలిపారు. దీనికి బాధ్యతగా వెంటనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి ఎన్నికల హామీల్లో భాగంగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని నిరుద్యోగ భృతి 3000 వెంటనే నిరుద్యోగులకు అందించాలని విద్యార్థులకు విద్యా దీవెన వసతి దీవెన తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో మాజీ సర్పంచుల పోరం అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, కత్రిమల సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, వంకరాజుకలువ సర్పంచ్ నరసింహా, రెక్కల చంద్రశేఖర్ రెడ్డి, బిసి నాయకులు రామచంద్ర, నీలూరు సర్పంచ్ రమణారెడ్డి, నారపరెడ్డి మహేష్ రెడ్డి, రమణ ,సాయి, ఎర్రెడ్డి, సత్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం పాలిటిక్స్ హీట్..

## - జేసీ వర్సెస్ కేతిరెడ్డి



**అనంతపురం - సూర్య వాస్తవం :**
అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయ ఉత్కంఠ పీక్స్‌కు చేరింది. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ వైసిపి శ్రేణులు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే వైసిపి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరులో ఒక భారీ నిరసన దీక్ష చేపట్టేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సైతం అదే నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరులో స్థానిక టీడీపీ కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపుతోంది.ఒకే లొకేషన్‌లో అటు ప్రతిపక్ష వైసీపీ నిరసన దీక్ష, ఇటు అధికార టీడీపీ కీలక నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సమావేశం ఒకేసారి జరగనుండటంతో పెద్దవడుగూరులో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల క్యాడర్ భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో భారీగా పోలీసు బలగాలను మోహరించి నిఘా పెట్టారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న అక్రమాల ఆరోపణలను తిప్పికొట్టేలా టీడీపీ నేతలు వ్యూహాలు రచిస్తుండటంతో తాడిపత్రి పాలిటిక్స్ మరోసారి హీటెక్కాయి. రాజకీయంగా ఎప్పుడూ సెన్సేషనల్‌గా ఉండే తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిల తాజా కదలికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నిరసన దీక్షకు పోలీసులు అనుమతి ఇస్తారా, లేదా అనే ఉత్కంఠ నడుస్తుండగానే ఇరు వర్గాలు సవాల్ ప్రతిసవాళ్లకు దిగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఒకే చోట జరుగుతున్న ఈ రెండు భిన్నమైన పొలిటికల్ యాక్టివిటీస్ రాబోయే గంటల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయోనని జిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు ఇరు పార్టీల ముఖ్య నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు స్థానిక వర్గాల నుండి

# డంపింగ్ యార్డా.. హెచ్ఎల్సీ కాలువా?

**- అనంతపురం నగరంలో చెత్త, ప్లాస్టిక్‌తో నిండిపోతున్న హెచ్ఎల్సీ కాలువ**
**- కాలుష్య నీటితో పంటలు.. ప్రజల ఆరోగ్యంపై ఆందోళన**
**- కాలువల్లో చెత్త వేస్తున్న వారిపై అధికారుల చర్యలు ఎక్కడ?**

**అనంతపురం కార్పొరేషన్ - సూర్య వాస్తవం :**
అనంతపురం నగరంలోని హెచ్ఎల్సీ కాలువ. నగరంలో విచ్చలవిడిగా పడేస్తున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువ పరిసరాలు మురికి కుప్పగా మారుతున్నాయి.కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త కారణంగా నీటి ప్రవాహానికి కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కాలువకు నీరు విడుదల చేసిన సమయంలో ఈ వ్యర్థాలు నీటితో పాటు దిగువ ప్రాంతాలకు చేరే అవకాశం ఉంది. అదే నీటిని ఆధారంగా చేసుకుని రైతులు వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు వ్యవసాయ భూములపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వనరులను ఇలా చెత్తకుప్పలుగా మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన కాలువలను మురికి కాలువలుగా మార్చుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కాలువల్లో చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటికే పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి కాలువను శుభ్రం చేయాలని రైతులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. సాగునీటి వనరులను కాపాడాల్సిన బాధ్యత అధికారులతో పాటు ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్ఎల్సీ కాలువలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల





సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా?

**అధికారులు స్పందించాల్సిన సమయం**
సాగునీటి వనరులను పరిరక్షించడం ఒక శాఖ బాధ్యతతో మాత్రమే పూర్తయ్యే విషయం కాదు. నగర పాలక సంస్థ, నీటిపారుదల శాఖ, కాలుష్య నియంత్రణకు సంబంధించిన అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.కాలువలో చెత్త వేస్తున్న ప్రాంతాలను గుర్తించి పర్యవేక్షణ పెంచడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట నిఘా చర్యలు చేపట్టడం, చెత్తను కాలువలోకి చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాల్సిన అవసరం ఉంది.

# తిట్టుకున్న వారు జట్టు కట్టి సీమపై కుట్రలు చేస్తున్నారు

**- కూటమి నేతలపై వైఎస్ఆర్సిపి నేత కెవి రమణ తీవ్ర విమర్శలు**
**- సిద్ధేశ్వరం బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణంతో సీమకు ప్రయోజనం**
**- కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వాలి**
**- కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్**

**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** రాజకీయ అవసరాల కోసం గతంలో ఒకరినొకరు విమర్శించు కున్న బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు ప్రస్తుతం కలిసి రాయలసీమ ప్రయోజనాలను విస్మరిస్తున్నారని వైఎస్ఆర్సిపి రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కెవి రమణ ఆరోపించారు. కలిసి ఉన్నప్పుడు అమరావతి రాజధానికి మద్దతు, విడిపోయినప్పుడు రాయలసీమ డిక్లరేషన్ అంటూ రాజకీయాలు చేయడం బీజేపీ విధానంగా మారిందని విమర్శించారు.భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరస్పరం ప్రశంసించుకోవడంపై ఆయన స్పందించారు. గతంలో తీవ్రంగా విమర్శించుకున్న నేతలు ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు.



**రాయలసీమ ప్రాజెక్టులపై ఎందుకు మౌనం?**
రాయలసీమకు జీవనాడిగా భావించే రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల అంశంపై ముగ్గురు నేతలు ఎందుకు స్పష్టంగా మాట్లాడటం లేదని కెవి రమణ ప్రశ్నించారు. కృష్ణానదిపై సిద్ధేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే సుమారు 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని, దక్షిణ తెలంగాణతో పాటు రాయలసీమకు ప్రయోజనం కలిగేలా కృష్ణా జలాలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

**కడప ఉక్కు పరిశ్రమపై విమర్శలు**
విభజన చట్టం ప్రకారం కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, ఈ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం విషయంలో అనేక సంవత్సరాలుగా శంకుస్థాపనలు, ప్రకటనలకే పరిమితమవుతున్నారని విమర్శించారు.

**నదీ జలాల విషయంలో సీమకు అన్యాయం**
తుంగభద్ర, కృష్ణా నదులపై కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు తమ వాటా నీటిని వినియోగించుకునేందుకు పలు ప్రాజెక్టులు చేపడుతున్నా, రాయలసీమ ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని కెవి రమణ ఆరోపించారు. రాయలసీమలో నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులకు అనుమతులు సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

**రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయాలి**
2018లో బీజేపీ ప్రకటించిన కర్నూలు రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు అంశాన్ని కూడా ప్రభుత్వం విస్మరించిందని, దీంతో శ్రీబాగ్ ఒప్పందం స్ఫూర్తికి విఘాతం కలుగుతోందని విమర్శించారు.అమరావతి అభివృద్ధి పేరుతో రాష్ట్ర అభివృద్ధిని ఒకే ప్రాంతంలో కేంద్రీకరించడం వల్ల రాయలసీమ మరింత వెనుకబడే ప్రమాదం ఉందని కెవి రమణ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, కడప ఉక్కు పరిశ్రమ, హైకోర్టు ఏర్పాటు, నదీ జలాల హక్కులపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# జష్నే ఈద్ మిలాద్-ఉన్-నబీ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

**- పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న దర్గా కమిటీ సభ్యులు**
**- అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ ఆధ్వర్యంలో కార్యక్రమం**
**- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముతవల్లీలు, మత పెద్దలు, నాయకులు**




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :**
నగరంలోని పాత ఊరు మహల్దార్ స్ట్రీట్‌లో ఉన్న సయ్యదా మాసుమా బీబీ (ర.అ), సయ్యదా సారాన్ బీబీ (ర.అ) దర్గాలో జరగనున్న మహమ్మద్ ప్రవక్త (స.అ.వ) జన్మదిన వేడుకలకు సంబంధించిన జష్నే ఈద్ మిలాద్-ఉన్-నబీ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు, జామియా మస్జిద్ ముతవల్లి అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ ఆధ్వర్యంలో ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లపై చర్చించారు.కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు హిందూపురం ఖాదర్ సాబ్, సలీం సాబ్, దర్గా అధ్యక్షులు కె.యం. ఇక్బాల్ సాబ్, దర్గా కేర్‌టేకర్ కాలేషా, మహబూబ్ బాషా సాబ్, మదర్ సాబ్, హిందూపురం వహీద్ సాబ్, ఆసార్ ఖాదిం జిలాన్ సాబ్, యునస్ భాయ్, జాఫర్ ఆఫీస్ సాబ్, అస్లాం భాయ్, అల్లా బకాష్, ఐఎంఎం మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు రియాజ్, కట్టుబడి బాబాజీ, షేక్ నూర్ బాబా, షేక్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

## - 'సూర్య వాస్తవం' వార్తకు స్పందించిన వైద్య అధికారులు




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** మండల పరిధిలోని తనియాలి హరిజనవాడ, తనీయాలి కమ్మ కండ్రిగ గ్రామాలలో నిలువ చేరిన మురికి నీరు, సీజన్ వ్యాధులు ఉండడంతో ఆ గ్రామాలలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించడంలేదు. దీంతో సూర్య వాస్తవం విలేకరి గ్రామాలలో కనబడని ఫ్రైడే డ్రైడే తనీయాలి హరిజనవాడ, తనీయాలి కమ్మ కండ్రిగ గ్రామాల వీధులలో నిలువ చేరిన బురద నీరు అను వార్తను శనివారం సూర్య వాస్తవం దినపత్రికలో ప్రచురించింది. ఈ విషయం జిల్లా అధికారులు దృష్టికి పోవడంతో అధికారులు వెంటనే స్పందించి, సంబంధిత వైద్యాధికారులకు తెలియజేసి వెంటనే తనీయాలి గ్రామంలో వైద్య సిబ్బంది వీధులలో బ్లీచింగ్ పౌడర్ తో క్లోరినేషన్ చేయడం జరిగింది. అంతేకాకుండా గ్రామంలో ఇంటింటికి వెళ్లి గ్రామస్తులతో,మురికి నీరు నిలవ ఉండటం వల్ల ఎలాంటి ప్రమాదాలు వ్యాధులు సోకుతాయో ఆ మురికి నీటిలో ఎలాంటి క్రిమి కీటకాలు ఉత్పత్తి అవుతాయో వాటిపై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఇంటి చుట్టూ ఆవరణంలో నీటి నిలువ చేయకూడదని వాటిలో లార్వా లాంటి క్రిమి కీటకాలు ఉత్పత్తి పెరిగి మలేరియా డెంగ్యూ లాంటి వ్యాధులు సోకుతాయని జాగ్రత్తలు పాటించాలని సలహాలు సూచనలు తెలియజేశారు.

### లెక్చరర్లను తొలగించిన సంఘటనలో విచారణకు

# ప్రిన్సిపాల్, పలు అధికారులకు.. ఎస్సీ కమిషన్ నోటీసులు

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** దొరవారిసత్రం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకులంలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న7గురిని తొలగించిన సంఘటన విచారణ నిమిత్తం రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యాలయం నుండి నేడు విధుల్లో ఉన్న ప్రిన్సిపాల్ తిరుపతయ్య నుండి , స్టేట్ బిసి సెక్రటరీ,డిప్యూటీ సెక్రటరీ,అకౌంట్స్ ఆఫీసర్,రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వరకు విచారణ నిమిత్తం ఈ నెల 11న కమిషన్ కార్యాలయంలో హాజరుకావాలని నోటీసులు పంపినట్లు సమాచారం.వివరాల మేరకు పలు కారణాలు చూపించి గత ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పంపిన నివేదిక ప్రకారం ఎస్సీ కులానికి చెందిన 7గురి గెస్ట్ లెక్చరర్లను తొలగించడం పై జీవనోపాధి కోల్పోయిన ఏడుగురు సభ్యులు రాష్ట్ర ఎస్సీ కమిషన్ ను విచారించి న్యాయం చేయాలని ఆశ్రయించడం జరిగింది.స్పందించిన కమిషన్ జూలై 9న త్రిసభ్య కమిటీ సభ్యులుగా డాక్టరేట్ శ్రీపతి బాబు,గౌతమ్ రాజు,మేకల బిక్షం లు హాజరై వారి విచారణలో పలు విషయాలను సేకరించి,లెక్చరర్ల పనితీరుపై విద్యార్థుల నుండి కూడా అనేక విషయాలు రాబట్టారు.ఆ నివేదిక ఆధారంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ సారధ్యంలో లోతైన విచారణ నిమిత్తం ఈనెల 11న బీసీ గురుకులాల అధికారులు రాష్ట్ర సెక్రటరీ,డిప్యూటీ సెక్రటరీ, అకౌంట్స్ ఆఫీసర్,రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తో పాటు,నేడు ప్రిన్సిపాల్ గా కొనసాగుతున్న తిరపతయ్యను కూడా విచారణ నిమిత్తం కమిషన్ ముందు హాజరుకావాలని రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుండి నోటీసులు జారీ చేయడం జరిగింది. జీవనోపాధి కోల్పోయిన జి వీరరాఘవులు,మరో ఆరు మంది కి జరిగిన అన్యాయంపై గత రెండు నెలల క్రితం చేసిన ఫిర్యాదు మేరకు ఈనెల 11న విజయవాడ ఎస్సీ కమిషన్ లో అంతిమ సమగ్ర విచారణ జరిగే అవకాశం ఉంది.కమీషన్ లో జరిగే విచారణ మాకు ఊరట కలిగిస్తుందని ఫిర్యాదుల అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు.


GOVERNMENT OF ANDHRA PRADESH
AP STATE COMMISSION FOR SCHEDULED CASTES
4th FLOOR, NTR ADMINISTRATIVE BLOCK, APSRTC, PNBS, VIJAYAWADA - 520013.

Please treat this communication as most urgent and important.

# ప్రయాణికుల భద్రత ట్రాఫిక్ నియమాల పాటింపు

## - పోలీస్ శాఖ సూచించే భద్రత చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి - మంత్రి సత్య కుమార్"



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** ప్రయాణికుల భద్రత ట్రాఫిక్ నియమాల పాటింపు పోలీస్ శాఖ సూచించే భద్రత చర్యలకు ప్రతి ఒక్కరు సహకరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన శనివారం శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో రిక్షాలకు డిజిటల్ నంబర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల,ప్రయాణికుల భద్రత,ట్రాఫిక్ నియమాల పాటింపు,పోలీసు శాఖ సూచించే భద్రతా చర్యలకు సహకరించాలని వారికీ అవసరంపై అవగాహన కల్పించాలి అన్ని మంత్రి అన్నారు.ఆటో డ్రైవర్ల సంక్షేమం,భద్రతతో పాటు ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి.అన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ పోలీసు శాఖ అధికారులకు మంత్రి అభినందనలు తెలియజేసారు.

# డీఎస్సీ అక్రమాలపై న్యాయం జరిగే వరకు పోరాటం

-తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి
- సీబీఐ విచారణ జరిపి.. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి
- తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి
- అవకతవకలపై ప్రభుత్వం స్పందించాలి
-మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మూడో రోజు రిలే నిరాహార దీక్ష
-మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట- సూర్య వాస్తవం:**
డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు, అవకతవకలపై న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద మూడో రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**అవకతవకలపై ప్రభుత్వం స్పందించాలి**

ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ శాంతి యుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభ్యర్థులపై కూటమి పార్టీలకు చెందిన వ్యక్తులు దాడులకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్న వారిపై దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు.
జాతీయస్థాయిలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా యువత, విద్యార్థులు దేశ రాజధానిలో ఆందోళనలు చేపట్టిన సందర్భాన్ని వారు ప్రస్తావించారు. ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర స్థాయిలో బాధ్యత వహించిన మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అదే విధంగా రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షకు సంబంధించి స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఆడియోలతో సహా వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.

**సీబీఐతో విచారణ జరపాలి**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ చేయించాలని కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు.
ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని, విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై స్పందించడం లేదని వారు విమర్శించారు.

**అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి**

డీఎస్సీ నియామక ప్రక్రియలో అర్హత ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధిత అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణులు**

రిలే నిరాహార దీక్షలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి రాజారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి వేణు యాదవ్, నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, ఎస్ఆర్‌సీ సభ్యులు దబ్బల శ్రీమంత్‌రెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్‌రెడ్డి, పెళ్లకూరు మండల అధ్యక్షులు ఒబ్బు వెంకటరత్నం, దొరవారిసత్రం మండల అధ్యక్షులు అల్లూరు రాహుల్‌రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట మండల ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి, పెళ్లకూరు మండల ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు సన్నం ప్రిస్కిల్లా, లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు చదలవాడ కుమార్, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు కాళహస్తి భావన అనుదీప్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ షబ్బీర్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పాలేటి నాగార్జున, సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం జయరామయ్య, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎల్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బైనా మల్లికార్జున్‌రెడ్డి, పేర్నాటి రాహుల్, పేట చంద్రారెడ్డి, కట్టా భవానీశంకర్‌రెడ్డి, చదలవాడ కుమార్, బండి బాలు, కట్టా బాలసుబ్రహ్మణ్యం, మునిరాజా, వెంకటేష్, సుజాత, అశోక్, ఆనంద్, సుధారాణి, దయాకృష్ణ, శైలజ, చిత్ర, మురళి, సురేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దొరవారిసత్రం మండలానికి చెందిన కామిరెడ్డి ఈశ్వరబాబురెడ్డి, నాయుడు దయాకర్‌రెడ్డి, ఉక్కుముడి వెంకటశేషారెడ్డి, నెలబల్లి శివారెడ్డి, తమిదాలపాటి గోవర్ధన్‌నాయుడు, జమ్మల మనోహర్, ఆరని సురేందర్‌రెడ్డి, గోను ప్రసాద్, సుధీర్, గోను సుధాకర్, మీజూరు నవీన్‌కుమార్ తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు.




# ప్రధాన కూడళ్లలో విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు.

- భద్రతా చర్యల్లో భాగంగా వాహనాల తనిఖీలు ముమ్మరం
- సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్లు,రద్దీ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు.
- వాహనాల తనిఖీలతో పాటు ప్రజలకు అవగాహన కల్పించిన పోలీసులు.
- ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు భద్రతపై వాహనదారులకు సూచనలు.
- అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా.



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు శనివారం సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్లు,రద్దీ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.భద్రతా చర్యల్లో భాగంగా ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్,హెల్మెట్ వినియోగం తదితర అంశాలను పరిశీలించడంతో పాటు,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ప్రజలు, వాహనదారులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళలు మరియు బాలల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన,అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై అప్రమత్తత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరిస్తూ అనుమానాస్పద విషయాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బ రాయుడు, ఐపీఎస్.ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో తనిఖీలు,నిఘా, అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.





# ఏ పబ్లిసిటీకి రాని నయనతార 'టాక్సిక్' కోసం వచ్చారేమిటీ!



కన్నడ రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా నటించిన మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా మూవీ -టాక్సిక్- ట్రైలర్ లాంచ్ ఈవెంట్ అభిమానుల కోలాహలం మధ్య బెంగళూరులో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలో లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాధారణంగా సినిమాల ప్రమోషనల్ ఈవెంట్లకు దూరంగా ఉండే నయనతార, ఈ ఈవెంట్‌కు హాజరై ప్రసంగించడంతో వేదిక వద్ద ఉన్న అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. ఈ సందర్భంగా సీనియర్ నటి మాట్లాడిన స్ఫూర్తివంతమైన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ.. తాను వేదికలపై మాట్లాడటానికి పెద్దగా ఇష్టపడనని... అయితే ఈ చిత్రం తనకు ఎంతో ప్రత్యేక మైనది కావడంతోనే ఇక్కడికి వచ్చానని తెలిపారు. కథానాయకుడు యష్ కేవలం ఒక్క ఫోన్ కాల్ చేసి ఆహ్వానించగానే మరో ఆలోచన లేకుండా తాను ఈ ఈవెంట్‌కు రావడానికి ఒప్పుకున్నానని చెప్పారు. చిత్ర దర్శకురాలు గీతూ మోహన్ దాస్ అద్భుతమైన విజన్... కథనాన్ని నడిపించిన తీరు చూసి తాను ముగ్ధురా లినయ్యానని... ఇప్పటివరకు చూసిన ట్రైలర్ ఒక శాంపిల్ మాత్రమేనని... థియేటర్లలో ఈ సినిమా ప్రేక్షకుల మతులు పోగొట్టడం ఖాయ మని ధీమా వ్యక్తం చేశారు.

ఈ చిత్రంలో నటించిన తోటి కథానాయికల గురించి నయనతార ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ముఖ్యంగా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాణీ నటనను ఆకాశానికెత్తుతూ..--కియారా కెరీర్‌లోనే -టాక్సిక్- బెస్ట్ ఫిల్మ్‌గా నిలిచిపోతుంది. ఈ సినిమా తర్వాత కియారా ఇమేజ్ -టాక్సిక్‌కు ముందు.. టాక్సిక్ తర్వాత- అనేంతగా మారిపోతుందనడంలో సందేహం లేదు-- అని ప్రశంసించారు. అలాగే ఈ సినిమాలో పనిచేసిన తారా సుతారియా, హుమా ఖురేషీ, రుక్మిణిల నటనను, వారి తోటి అనుబంధాన్ని కూడా నయనతార ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. కథానాయకుడు యష్ వర్క్ ఎథిక్స్, అంకితభావాన్ని నయనతార విశేషంగా కొనియాడారు. యష్ నిజమైన పనిరాక్షసుడని.. ఒక నటుడిగా ఈ సినిమా కోసం ఆయన చేసిన త్యాగాలు సామాన్యమైనవి కావని అన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం యష్ దాదాపు నాలుగున్నరేళ్లపాటు తన వ్యక్తిగత జీవితాన్ని.. కుటుంబంతో , పిల్లలతో గడిపే సమయాన్ని త్యాగం చేశారని తెలిపారు. కేవలం ఒక నటుడిగానే కాకుండా కో-ప్రొడ్యూసర్‌గా సెట్స్‌లోని ప్రతీ ఒక్కరినీ సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకున్న తీరు యష్‌పై తనకున్న గౌరవాన్ని మరింత పెంచిందని వ్యాఖ్యా నించారు. చివరగా.. యష్ భార్య రాధిక పండిట్ గురించి నయనతార మాట్లాడిన మాటలు అందరి హృదయాలను హత్తు కున్నాయి. ఒక సినిమా బ్లాక్‌బస్టర్ అయినప్పుడు ప్రపంచం అంతా నటీనటుల శ్రమను పొగుడుతుందని.. కానీ వారి వెనుక ఉండి త్యాగాలు చేసే కుటుంబాలను ఎవరూ గుర్తుంచుకోరని ఆవేదన వ్యక్తం చేశారు. యష్ సాధించిన ఈ అంతర్జాతీయ స్థాయి విజయం వెనుక రాధిక త్యాగం-మద్దతు ఎంతో ఉన్నా యని... ఆమె యష్‌కి అతిపెద్ద బలమని అన్నారు. నయనతార ఇచ్చిన ఈ హార్ట్ టచింగ్ స్పీచ్‌తో -టాక్సిక్- చిత్రంపై ఉన్న అంచనాలు మరింత పరాకాష్టకు చేరాయి.

# చివరి నిమిషంలో మోహన్‌లాల్ సిడ్నీ షో వాయిదా.. కారణమిదే!

**మోహన్‌లాల్ సిడ్నీ షో చివరి నిమిషంలో వాయిదా**

**ఆస్ట్రేలియా వీసా సకాలంలో మంజూరు కాకపోవడమే కారణం**

**జరిగిన దానికి పూర్తి బాధ్యత తనదేనంటూ క్షమాపణ చెప్పిన మోహన్‌లాల్**

**ఇప్పటికే సిడ్నీ చేరుకున్న గాయని చిత్ర సహా ఇతర కళాకారులు**

**వీసా తిరస్కరణకు గురవలేదని, ప్రాసెస్‌లో ఉందని నిర్వాహకుల వెల్లడి**

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ సిడ్నీలో నిర్వహించాల్సిన లైవ్ షో చివరి నిమిషంలో వాయిదా పడింది. ఆస్ట్రేలియా వీసా సకాలంలో మంజూరు కాకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. "వైకిట్టు ఎంథ పరిపాడి" పేరిట ఈ కార్యక్రమాన్ని శనివారం సిడ్నీలోని నార్వెస్ట్ కన్వెన్షన్ సెంటర్‌లో కాయల్ ఈవెంట్స్ సంస్థ నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు ప్రముఖ గాయని కేఎస్ చిత్ర, నటుడు మనోజ్ కే జయన్ సహా ఇతర కళాకారులు ఇప్పటికే ఆస్ట్రేలియా చేరుకున్నారు. అయితే, వీసా క్లియరెన్స్ కోసం సింగపూర్‌లో వేచి చూస్తున్న మోహన్‌లాల్‌కు అనుమతి లభించకపోవడంతో ఆయన ప్రయాణం రద్దయింది. వీసా దరఖాస్తు తిరస్కరణకు గురికాలేదని, కేవలం ప్రాసెసింగ్‌లో అనుకోని జాప్యం జరిగిందని నిర్వాహకులు స్పష్టం చేశారు. త్వరలోనే కార్యక్రమ తదుపరి తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ పరిణామంపై మోహన్‌లాల్ వీడియో సందేశం ద్వారా అభిమానులకు క్షమాపణలు తెలిపారు. "ఇది ఎలా జరిగిందో నాకు తెలియదు. సాంకేతిక కారణమో లేక క్లరికల్ పొరపాటో ఏదైనా కావచ్చు, దీనికి పూర్తి బాధ్యత నేనే వహిస్తున్నాను. నేను రాలేకపోతున్నాందుకు అందరికీ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఇదే బృందంతో మళ్లీ ప్రదర్శన ఇస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



# వైభవ్ సూర్యవంశీని చూసి ధావన్ ఫిదా.. ఆ ఒక్క లక్షణమే కారణమట!





యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసలు కురిపించారు. 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమని అన్నారు. షాట్లు ఆడే నైపుణ్యం ఉండటం ఒకటైతే.. వాటిని ఆడే ధైర్యం ఉండటం మరో విషయమని చెప్పారు. "వైభవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. 15 లేదా 16 ఏళ్లకే అంతర్జాతీయ స్థాయికి చేరడం చాలా గొప్ప విషయం. ఐపీఎల్‌లోనూ అతడు అద్భుతంగా ఆడాడు.

ఫోర్లు, సిక్సర్లు కొట్టే విధానం ఆకట్టుకుంటోంది. నైపుణ్యం ఉండటం ఒక విషయం. కానీ 15 ఏళ్ల వయసులోనే ఆ షాట్లు ఆడే ధైర్యం ఉండటం చాలా ప్రత్యేకం" అని ధావన్ అన్నారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల్లో వైభవ్ 151 పరుగులు చేశాడు. దీంతో తొలిసారి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు అందుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 3-0తో గెలిచింది. అంతకుముందు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్.. టీమిండియా తరఫున ఆడిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్ 776 పరుగులు చేశాడు. 237.30 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ఒక సెంచరీ, ఐదు అర్ధ సెంచరీలు సాధించాడు. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు.

ఎమర్జింగ్ ప్లేయర్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ సహా పలు అవార్డులు గెలుచుకున్నాడు. అండర్-19 ప్రపంచకప్‌లోనూ 439 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా నిలిచాడు. ఇదిలా ఉండగా.. ధావన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని పితంపురలో ఓ పాఠశాలలో రాజువీ ల్యాబ్‌ను ప్రారంభించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితంపై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే దీని లక్ష్యం. ఈ ల్యాబ్‌తో 2,500 మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. డిజిటల్ విద్యా కార్యక్రమాల ద్వారా ఇప్పటికే 50 వేల మంది పిల్లలకు తమ ఫౌండేషన్ చేరువైందని ధావన్ తెలిపారు.



## వార్మప్ మ్యాచ్‌లో సెంచరీతో మెరిసిన పడిక్కల్... లంక ఎలెవన్ స్కోరుకు చేరువలో భారత్

లంక పర్యటనలో భాగంగా శ్రీలంక ఎలెవన్ జట్టుతో జరుగుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో చెలరేగాడు. తొలి టెస్టుకు రెగ్యులర్ బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా దూరమవడంతో, ఆ స్థానం కోసం తను సిద్ధంగా ఉన్నానంటూ పడిక్కల్ సెలక్టర్లకు బలమైన సంకేతం పంపాడు. శనివారం నాటి రెండో రోజు ఆటలో పడిక్కల్ (142 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కడంతో పాటు, రవీంద్ర జడేజా (63) కూడా రాణించాడు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. అంతకుముందు శ్రీలంక ఎలెవన్ జట్టు తొలి ఇన్నింగ్స్ ను 363/8 వద్ద డిక్లేర్ చేయగా, ఆ స్కోరుకు భారత్ మరో 6 పరుగుల దూరంలో ఉంది. మొత్తం మీద సాయి సుదర్శన్ గైర్హాజరీలో, పడిక్కల్ అద్భుత ఫామ్‌తో నమ్మకమైన ప్రత్యామ్నాయంగా నిలిచాడు. కొలంబోలోని నాన్‌డిస్క్రిప్ట్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత ఇన్నింగ్స్ పేలవంగా ప్రారంభమైంది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే, క్రీజులోకి వచ్చిన పడిక్కల్ ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా దూకుడుగా ఆడాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (40)తో కలిసి రెండో వికెట్‌కు కీలకమైన 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. తన క్లాస్ షాట్లతో అలరించిన పడిక్కల్, సెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత (103 వద్ద) ఇతర బ్యాటర్లకు అవకాశం ఇచ్చేందుకు రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) త్వరగా ఔటైనా, రవీంద్ర జడేజా.. మానవ్ సుతార్ (41)తో కలిసి మరో విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. జడేజా కూడా హాఫ్ సెంచరీ తర్వాత రిటైర్డ్ ఔట్ అయ్యాడు. చివర్లో గుర్నూర్ బ్రార్ (18 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్సులు) విధ్వంసకర బ్యాటింగ్‌తో అలరించాడు. తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ తన స్కోరును 142 పరుగులకు చేర్చుకున్నాడు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలి

-అన్ని పంటలకు కనీస మద్దతు ధర 50 శాతం కలిపి ఇవ్వాలి
- ఉపాధి హామీ పనులు 200 రోజులకి కల్పించి కనీస వేతనం 700 రూపాయలు ఇవ్వాలి
- కర్నూలు కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు నష్ట పరిహారం అందించాలి
- ఆగస్టు 10 న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైలు భరో



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ ప్రభుత్వం యాజమాన్యాలు కనుగుణంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని, అమెరికాతో భారత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు ద్వారా రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతున్న నేపథ్యంలో వాటిని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 10న నిర్వహించే క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి హెచ్ రంగన్న, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాలూకా అధ్యక్షులు ఉమాపతి చేతి వృత్తి దారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం కారన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉరుకుందులు పిలుపునిచ్చారు. శనివారం నాడు పత్తికొండ చదువుల రామయ్య భవన్ నందు కార్మిక ,రైతు, వ్యవసాయ సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోడీ అధికారం వచ్చిన తర్వాత రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం నిరుద్యోగ సమస్య రోజురోజు పెరుగుతున్న ఉద్యోగాలు కల్పనలో వైఫల్యం చెందారు. నిత్యవసర సరుకులు ధరలు ఆకాశమందుతున్న వాటిని తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుపోవడంతో ప్రజలపై భారం పెరిగిందని విమర్శించారు. దేశంలో రైతులు వేసిన పంటలు కనీసం మద్దతు ధర కల్పించలేకపోవడంతో రైతుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వ్యవసాయ ఖర్చులు మరియు కమిషన్ నిర్ణయించిన ధరలకు ఉత్పత్తి పంటలపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర కల్పించినప్పుడే రైతులు బాగుపడతారని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు తక్కువ పడంతో రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతుల బ్యాంకు రుణాలు రద్దు చేయాలని కరువు పింఛన్లు రైతులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసి జిల్లా ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రాజెక్టుల ద్వారానే కరువు నివారణ సాధ్యం**

కర్నూలు జిల్లాలో కరువు నివారణ చర్యలు భాగంగా పెండింగ్లో ఉన్న వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టుల నిర్మాణ కే తక్షణమే నిధులు విడుదల చేసి వాటిని పూర్తి చేయడం ద్వారానే కరువు నివారణకు సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో అత్యధిక వర్షపాతం తక్కువ ఉన్న కర్నూలు జిల్లాను వెనుకబాటుకు ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి అధిక నిధులు కేటాయించాలని, సాగు త్రాగునీటి ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాల్వ ద్వారా జిల్లాలో పంటలు సాగు చేసేందుకు పంట కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.

**ఉపాధి కూలీలకు కనీస వేతనం 700 ఇవ్వాలి**

ఉపాధి వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రోజుకి 700 రూపాయలు సంవత్సరానికి 200 పని రోజులు కల్పించాలని, కేంద్రం 90 శాతం రాష్ట్రం 10శాతం నిధులు పాత పద్ధతి కొనసాగించాలని వి బి జి రామ్ జి పేరు మార్చడం ద్వారా అభివృద్ధికి సాధ్యం కాదని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షులు జి.నెట్టికంటయ్య ఏఐటీయూసీ తాలూకా ఉపాధ్యక్షులు మాజీ వార్డ్ మెంబర్ గుండు భాష, ఎం.రాజప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పందికొన నరసింహుడు,హమలి సంఘం అధ్యక్షుడు పోగు.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్త్ భారత్ అభియాన కార్యక్రమంలో పాల్గొన్న "మంత్రి సత్య కుమార్ యాదవ్"





**ధొరవారిసత్రం - సూర్య వాస్తవం:** ధర్మ వరంలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిగరెట్,గుట్కా,మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు,ఇతర వ్యసనాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలి. వ్యసనాలు వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాన్ని,సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.అని మంత్రి అన్నారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది.2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమశిక్షణ,మంచి ఆలోచనలు,నైపుణ్యాలను అలవర్చుకోవాలి. మంత్రి సత్య కుమార్ అన్నారు. వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలి. యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచుతూ, వారికి మంచి భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలి. మీ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

## హెల్మెట్ తప్పనిసరి.... పత్తికొండ పోలీస్



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** పత్తికొండ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద పత్తికొండ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ను తప్పనిసరిగా వినియోగించాలని సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని వాహనదారులకు వివరించారు.ముఖ్యంగా గత 10 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా హెల్మెట్ ధరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్న గుంతకల్కు చెందిన లెక్చరర్ హుస్సేన్ బాషా గారిని, అలాగే మరో వాహనదారుడిని శాలువా కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు.కావున ప్రతి వాహనదారుడు రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని పత్తికొండ పోలీసులు విజ్ఞప్తి చేశారు

# పత్తికొండను కరువు మండలంగా ప్రకటించాలి : సీపీఐ

## కరువు కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలి

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** పత్తికొండ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని, కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజాసాహెబ్, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, డిమాండ్ చేశారు. సీపీఐ చేపట్టిన పాదయాత్రలో భాగంగా దేవనబండ, నలకదొడ్డి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే నలకదొడ్డి చెరువుకు నీళ్లు మళ్లించాలని కూడా డిమాండ్ చేస్తూ ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. నలకదొడ్డి చెరువుకు శాశ్వతంగా నీటి మళ్లింపు చేయాలని కూడా ప్రత్యేకంగా డిమాండ్ చేశారు. కరువు కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు .50 రూపాయలు వేల చొప్పున నష్టపరిహారం వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం ఇల్లు నిర్మించుకోవడానికి నాలుగు లక్షలఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని వారు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. అలాగే ఈ నెల 18వ తేదీన కర్నూలులో నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, పేదలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.




ఈ పాదయాత్రలో చేతులతో దారి జిల్లా కార్యదర్శి ఎం కారణ. జిల్లా సమితి సభ్యులు. నెట్టకంటయ్య పెద్ద వీరన్న. రామాంజనేయులు. మండల సహాయ కార్యదర్శి జనాపురం కాసిం. ఎం కే సుంకన్న. నలకదొడ్డిశాఖ కార్యదర్శి బచ్చాల ఈరన్న. ఉరుకుంద. జగదీష్. లక్ష్మన్న. మస్తాన్.ఏఐవైఎఫ్. సిద్దు . ఉపేంద్ నాగేంద్ర.నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జైల్‌భరో

## కార్మికులు, రైతులు, ప్రజలు కదం తొక్కాలి: రైతు సంఘం జిల్లా కార్యదర్శి, రామకృష్ణ,

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :**కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులను హరిస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నిర్వహించే జైల్‌భరో, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పత్తికొండ మండల సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర పిలుపునిచ్చారు. పత్తికొండ పట్టణంలోని స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కార్మికులు చెమటోడ్చి సంపద సృష్టిస్తున్నా వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదన్నారు. రూ.31 వేల కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ పనుల్లో కొనసాగుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని విమర్శించారు. అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతుల రుణాలు మాఫీ చేసి, ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసే చర్యలను ఆపాలి. 200 రోజుల పని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలి. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించే ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యుడి జీవితం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కుల, మతాల పేరుతో విడదీసే రాజకీయాలను తిప్పికొట్టి, కార్మికులు--రైతులు--ప్రజలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతుల రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్లను పూర్తి చేయాలని, హంద్రీ--నీవా ద్వారా పంటలకు సాగునీరు అందించేందుకు కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 10న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే జైల్‌భరో, నిరసన కార్యక్రమాలకు వేలాదిగా తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పాలని రామకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం. రవిచంద్ర కోరారు.

**ప్రధాన డిమాండ్లు:**

- రూ.31 వేల కనీస వేతనం అమలు చేయాలి.
- లేబర్ కోడ్లను రద్దు చేయాలి.
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి.
- అన్ని పంటలకు 50 శాతం అదనపు మద్దతు ధర ఇవ్వాలి.
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలి.
- ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలి.
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలి.
- కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి రైతుల రుణాలు మాఫీ చేయాలి.
- వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్లను పూర్తి చేసి హంద్రీ--నీవా ద్వారా సాగునీరు అందించాలి.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు మధు రాజుల కారప్ప సిఐటియు నాయకులు రామాంజనేయులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : M. SULEMAN SAHEB H. No 158/56 UMA NAGAR, ANANTHAPURAM ANDHRA PRADESH - 515001. CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )